ప్రజాశక్తి

సోమవారం 29 డిసెంబరు, 2025 | 8 పేజీలు

శ్రీకాకుళం

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు వేదిక

శ్రీకాకుళం సిటీ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు తెలుసుకోవాలంటే 1100 ఫోన్ చేయవచ్చని వివరించారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రతి గ్రామమూ సుందరమే

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- గార

పట్టణాలకు దీటుగా, ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తామని, చేసి చూపిస్తున్నామని, ప్రతి గ్రామమూ సుందరమే కూటమి ధ్యేయమని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ 15 ఫైనాన్స్ కమీషన్ నుంచి రూ.50 లక్షల విలువ ఉన్న వైద్యశాలను, శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెపిహెచ్‌బివి నుంచి రూ.260 లక్షల విలువ ఉన్న బాలికల హాస్టల్, శ్రీకాకుళం ఎల్‌బిఎస్ కాలనీ పద్మావతి నగర్‌లో హెచ్‌ఎంసియే, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.19 లక్షలతో సిసి రోడ్లు, ఎంపిడిఒ కార్యాలయ సుమారు రూ.34 లక్షలతో సిసి రోడ్లను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారాలతో రాష్ట్రాన్ని సుపరిపాలన దిశగా, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఎమ్మెల్యే శ్రీకాకుళాన్ని ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాశాఖాధికారి అనిత, మండల, నగర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దాం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

(వార్త...2)

'చలో విశాఖపట్నం' విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

2026 జనవరి 4న చలో విశాఖపట్నం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండలంలోని ఎన్‌ఎసిఎల్ పరిశ్రమ వద్ద అఖిల భారత మహాసభలు ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి వచ్చే 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిల భారత మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 4న మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం ఆర్‌కె బీచ్ వద్ద భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్లు ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నా యని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ల ప్రయోజనాలు కోసం కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మిక చట్టాలు స్థానంలో లేబర్ కోడ్లు తీసుకువచ్చారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్.రామప్పుడు, పి.సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : మాట్లాడుతున్న నాగమణి

శ్రీకాకుళం సిటీ: జనవరి 4న చలో విశాఖపట్నం విజయవంతం చేయాలని కళాసీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, ఆర్.ప్రకాశరావు పిలుపునిచ్చారు. నగరంలోని ట్రాన్స్ పోర్టు హమాలీలను కలిసి మహాసభల ప్రచారం చేశారు. కార్యక్రమంలో బి.త్రినాథరావు, మల్లేష్, అప్పన్న, వి.సింహాచలం, బి.వేణు, ఎం.అప్పా రావు, ఎల్.రవి, గంగారావు పాల్గొన్నారు.

పొందూరు: చలో విశాఖపట్నం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. పొందూరు పట్టణంలో ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.లీలావతి, నాయకులు మణికుమారి, ఎస్.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం సిటీ : ప్రచారం చేస్తున్న కళాసీలు

క్రీడల్లో సిక్కోలు సత్తా

- 2025లో జిల్లా క్రీడాకారులకు అంతర్జాతీయ ఖ్యాతి
- ఐపిఎల్‌కు త్రిపురాన విజయ్ ఎంపిక
- పారా క్రీడల్లో సత్తాచాటిన రామకృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా ఒకప్పుడు మారుమూల ప్రాంతం. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్నిరంగాల్లో నైపుణ్యంతో ఇక్కడ యువత దూసుకుపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారు. భావితరాలకు స్ఫూర్తిగా మన యువత నిలుస్తున్నారు. 2025లో క్రీడల్లో మన జిల్లా యువత తమదైన ముద్ర వేశారు. తమ సత్తాతో అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు.

ఐపిఎల్‌లో ఎంట్రీ

భారత క్రికెట్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) అత్యంత డిమాండ్ ఉన్న టోర్నమెంట్. ఈ టోర్నమెంట్‌కు మన జిల్లా టెక్కలి ప్రాంతానికి చెందిన త్రిపురాన విజయ్ ఐపిఎల్ ఢిల్లీ క్యాపిటల్స్ ఎంపికయ్యాడు. రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్ బౌలింగ్, సమర్థవంతంగా బ్యాటింగ్ సైతం చేయగలడు. ఆల్‌రౌండర్ ప్రతిభతో ఐపిఎల్‌కి ఎంపిక అయ్యాడు. రంజీ మ్యాచ్‌ల్లో సైతం మెరుగ్గా రాణించడంతో ఐపిఎల్‌కు అవకాశం వచ్చింది. ఐపిఎల్‌లో రాణిస్తే దేశవాళీ జట్టులో ప్రవేశానికి మంచి అవకాశం లభిస్తుంది. శ్రీకాకుళం జిల్లా యువకుడు ఐపిఎల్‌కు ఎంపికై యువతకు స్ఫూర్తిగా నిలిచాడు. ఈ ఏడాది ఐపిఎల్‌లో సందడి చేయనున్నాడు.

విరాట్ కోహ్లితో విజయ్

అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ

అంగవైకల్యం తనకు అడ్డు రాదని సౌత్ ఏషియన్ పారా క్రీడల్లో సత్తా చాటాడు బొగ్గు రామకృష్ణ. డిసెంబరు 6 నుంచి 10 వరకు శ్రీలంక దేశంలోని రత్నాపూరలో నిర్వహించిన సౌత్ ఏషియన్ పారా త్రో బాల్ ఛాంపియన్‌షిప్-25లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. శ్రీకాకుళం నగరంలోని బలగ ప్రాంతానికి చెందిన ఈయన భారత జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు. జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయస్థాయికి తీసుకువెళ్లాడు. ఇక్కడ పెయింట్ వేసుకొని జీవించేవి వ్యక్తి తన నైపుణ్యాన్ని తెలియజేశాడు.

చరిత్ర సృష్టించిన అథ్లెట్స్

పలాస-కాశీబుగ్గ న్యూ కాలనీకి చెందిన పోతనపల్లి యశ్విత అట్లెట్లో తన సత్తా చాటింది. ఏషియన్ గేమ్స్‌కు హైజంప్ క్యాటగిరిలో ఎంపికైంది. జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శనతో ఈ స్థాయికి చేరుకుంది. గత మూడేళ్లగా జాతీయస్థాయిలో అండర్-16 విభాగంలో బంగారు పతకాలు సాధిస్తూ వస్తుంది. బ్రహ్రెయిన్ నిర్వహించే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొననుంది. నిరంతర సాధనతో ముందుకు సాగుతుంది.

వాలీబాల్‌లో సత్తా

పలాస మండలం అంతరకుడ్డకు చెందిన అట్టాడ చరణ్ వాలీబాల్‌లో రాణిస్తున్నాడు. జూలై (మిగతా...2)

వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

- సమస్యలు తెలుసుకునేందుకు స్వాభిమాన్ నిర్వహణ
- అవసరం మేరకు ట్రై సైకిళ్లు పంపిణీ
- ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా కృత్రిమ అవయవాల అవసరం గుర్తింపు
- వికలాంగ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి శైలజ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా వికలాంగ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి శైలజ అన్నారు. విద్యుత్ మోటార్ ట్రై సైకిళ్ళు, ట్రై సైకిళ్ళు, కృత్రిమ అవయవాలు వంటి అవసరం మేరకు అందజేస్తున్నట్లు చెప్పారు. వికలాంగులు సంక్షేమమే లక్ష్యంగా వారి సమస్యలు తెలుసుకునేందుకు నెలలో ప్రతి మూడో శుక్రవారం స్వాభిమాన్ గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖిముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు వివరాలు వెల్లడించారు.

? వికలాంగ కార్పొరేషన్ ద్వారా అందుతున్న సేవలు ఏమిటి?

వికలాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు, వికలాంగ ధ్రువీకరణ పత్రం అంగవైకల్య శాతం మేరకు మూడు చక్రాల సైకిళ్ళు, వీల్ చైర్స్, ఊత కర్రలు, కృత్రిమ అవయవాలు, చదువుకున్న యువతకు, విద్యార్థులకు లాప్టాప్స్ అందజేస్తున్నాం. బదిరులకు వినికిడి యంత్రాలు, టచ్ ఫోన్స్, అంధులకు ప్రత్యేక ఊత కర్రలు, బ్రెయిలీ లిపి పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి అందజేస్తున్నాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరించి అర్హత మేరకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేస్తున్నాం.

? ప్రభుత్వం ఎటువంటి పథకాలు అందజేస్తుంది?

ఉపాధి కోసం సొంత వాహనాలు నడుపుతున్న వారికి నెలకి 50 శాతం రాయితీపై 15 లీటర్లు పెట్రోల్ ప్రభుత్వం మంజూరు చేస్తున్నాం. స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వికలాంగులకు స్వయం ఉపాధి కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం.

? వికలాంగులకు పింఛన్ల మంజూరు ఎలా ఉంది?

ప్రస్తుతం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 30,453 మంది వికలాంగులకు పింఛన్లు అందజేస్తున్నాం. మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛను అందజేస్తున్నాం. వికలాంగ శాతం మేరకు పింఛను మంజూరవుతుంది.

(మిగతా...2)

బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం మండలంలోని పెద్దసీది హైస్కూల్‌లో మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యాన నియోజకవర్గస్థాయి ప్రతిభ పరీక్ష పోటీలు నిర్వహించారు. ఇందులో విజయం సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభే సమాజ భవిష్యత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. ప్రతిభా పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు విలువైన ప్రోత్సాహక బహుమతులను తనవంతుగా అందజేసి అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించిన ఎమ్మెల్యే చర్యను పలువురు అభినందించారు.

మెమోంటోను అందజేస్తున్న ప్రిన్సిపాల్ వంశీధర్

జ్యోతికకు అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ 2024 ఏడాదిలో నిర్వహించిన టైప్ రైటింగ్ జూనియర్ విభాగంలో పట్టణానికి చెందిన పాలేపు జ్యోతిక స్టేట్ ఫస్ట్‌గా నిలిచి బంగారు పతకం సాధించింది. శకుంతలబాయితో స్థాపించిన ప్రభుత్వం గుర్తింపు పొందిన పద్మావతి కమర్షియల్ టైప్ ఇన్స్టిట్యూట్‌లో ఆదివారం అభినందించారు. జ్యోతికతో పాటు హయ్యర్ విభాగంలో రెండో ర్యాంకు సాధించిన రామ్‌ప్రసాద్ బేహర, మూడో ర్యాంకు సాదించిన శివమహారాణకు ఎపి టైపింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్స్టిట్యూట్ అసోషియేషన్ పంపించిన మెడల్స్, షీల్డ్సని సీనియర్ టైపు ఇన్స్ట్రక్టర్ మోహన్‌కృష్ణ అందజేశారు. కార్యక్రమంలో టైప్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ భైరాగి వంశీధర్, ఇన్స్ట్రక్టర్ మాధుర్, పాలేపు చిన్న, నీలాపు శ్రీను, రాము, నందిగాం కోటి, నీలపు వెంకటరెడ్డి, కొర్రయి ధర్మరాజు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి మామిడిపల్లి సమస్యలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పంచాయతీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రెయ్యి కోదండ కృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రిని కలిసి మాట్లాడారు. గ్రామంలో సామాజిక భవనం, గ్రంథాలయ భవనం ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక ఆస్పత్రిలో లో వోల్టేజ్ కారణంగా విద్యుత్ సమస్య ఉందని వివరించారు. ప్రభుత్వ విప్ అశోక్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ

పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దాం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం సిటీ: ప్రపంచ ఖ్యాతిని ఆర్జించిన పొందూరు ఖాదీని మళ్లీ ప్రాచుర్యంలోకి తీసుకురావాలని కేంద్ర పౌరవిమా నయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం సభ్యులు, స్థానిక టిడిపి నాయకులు, పొందూరు ఖాదీ కార్మికులు ఆదివారం భేటీ అయ్యారు. తమ ఖాదీలో నకిలీల బెడద అరికట్టే విధంగా, పొందూరు ఖాదీకి విలువ పెంచే విధంగా జిఐ ట్యాగ్ మంజూరుకు కృషి చెందినందుకు ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాల తమ కష్టాన్ని తొలగించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ.. ఇదే తోడ్పాటు భవిష్యత్‌లోనూ అందివ్వాలని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ నేతన్నల తోడ్పాటుతో మళ్లీ పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దామని అన్నారు. జిఐ ట్యాగ్‌తో పూర్వ వైభవం సాధించడం సులభమని అన్నారు. పొందూరు ఖద్దరు అంటే గౌరవమని, ఆ గౌరవాన్ని కాపాడుతున్న నేతన్నలకు కూటమి సర్కారు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పొందూరు పట్టణ అధ్యక్షుడు శ్రీరంగనాయకులు, టిడిపి నాయకులు దండా రవికుమార్, ఆంధ్ర ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం అధ్యక్షులు గొంటుకు కామేశ్వరప్రసాద్, కార్యదర్శి దండా వెంకటరమణ, ఉపాధ్యక్షులు కొండలరావు, కార్యవర్గ సభ్యులు, ఖాదీ కార్మికులు పాల్గొన్నారు.

ఏడు రోజులు రథసప్తమి

అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో ప్రధాన వార్షిక ఉత్సవం రథసప్తమిను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన క్యాంప్ కార్యాలయంలో రథసప్తమి ఏర్పాట్లపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సమీక్షించారు.

ఒడియా గణిత టాలెంట్ టెస్టుకు స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎపి ఒడియా టీచర్స్ అసోషియేషన్ (అపోటా) ఆధ్వర్యాన ఒడియా మాధ్యమంలో నిర్వహించిన గణిత టాలెంట్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మాథ్స్ టాలెంట్ పరీక్షకు నాలుగు మండలాల నుంచి 106 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలలో 8వ తరగతి విభాగంలో ఢిల్లేశ్వరరబెహర జెడ్‌పిహెచ్‌ఎస్ ఈదుపురం ఒడియా, 9వ తరగతి విభాగంలో అశ్విని బెహర జెడ్‌పిహెచ్‌ఎస్ ఈదుపురం ఒడియా, 10వ తరగతి విభాగంలో మిక్కి బెహర జెడ్‌పిహెచ్‌ఎస్ కొళిగాం విద్యార్థులు మొదటి స్థానాలు సాదించారు. ఈ పరీక్షలకు జిల్లా పరిశీలకులుగా ప్రశాంత్ పాడి, కో-ఆర్డినేటర్ ప్రశాంత్ లిమ్మాయిలు వ్యవహరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఇఒ-2 ఎస్.విశ్వనాథం, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, ఒడియా గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలగ సంఘం ఆత్మీయ కలయిక

కోటబొమ్మాళి: అందరినీ కూడకట్టేది ఆత్మీయ కలయిక అని తెలగ సంఘం నాయకులు పల్లంపట్ల వెంకట రామారావు అన్నారు. కోటబొమ్మలో తెలగ సంక్షేమ సంఘం వన సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా తెలగల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి పునాదులు వేసుకోవచ్చు తెలిపారు. కార్యక్రమంలో దాసరి మోహనరావు, రొక్కం రమేష్, దాసరి లక్ష్మణరావు, లాలిసెట్టి గోవిందరావు, ఎర్నాగుల వాసుదేవరావు, మండపాక నర్సింగరావు, గొంటి నాగభూషణరావు, నాల్ల ప్రకాశరావు, రొక్కం నీలకంటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి- కంచిలి

మండల కేంద్రంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మట్ట ప్రణీత్ (15) ఆదివారం జలంత్రకోట జాతీయ రహదారి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రణీత్ ఇటీవల క్రిస్మస్ సెలవులకు స్వగ్రామైన సోంపేట మండలం పోత్రకొండ వెళ్లాడు. సెలవుల అనంతరం పాఠశాలకు వెళ్లేందుకు ఆదివారం తండ్రి హేమంతరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వారు జాతీయ రహదారి మీదుగా కంచిలి వస్తుండగా... జలంత్రకోట కూడలి సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రణీత్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, హేమంతరావు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సోంపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఘనంగా జాషువా జయంతి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టూరు బిట్-3లో కవి కోకిల గుర్రం జాషువ జయంతి కళాపీఠం అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం, కొత్త కేలండర్‌ను ఆవిష్కరించారు. స్థానిక కళాకారులకు ప్రభుత్వ సరఫరా చేసిన కళాకారుల డిజిటల్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుర్రం జాషువ కళాపీఠం అధ్యక్షులు గేదెల సుందర నారాయణ, పార్ని గోవిందరావు, డి.పారినాయుడు, గౌరవాధ్యక్షులు, ప్రముఖ రంగస్థల కళాకారిణి జిజమంగాదేవి, రాష్ట్ర అధ్యక్షులు డి.ధనంజయరావు, రాష్ట్ర కార్యదర్శి రౌతు వాసుదేవరావు, పద్మశ్రీ గ్రహీత యడ్ల గోపాలరావు, విద్యావేత్త ప్రతాప్ మాస్టర్, బొంగు భాస్కరరావు, సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన ఆదివారం స్థానిక గాంధీ మండపం కూడలి వద్ద వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం మనకేమి ఇచ్చిందని కాకుండా, సమాజానికి మన వంతు సేవ చేయాలని దృక్పథంతో పూర్వ విద్యార్థులు చేసిన సేవలు ఎంతో మందికి ఆదర్శనీయమన్నారు. విద్యార్థుల సమ్మేళనం అంటే పార్టీలు, ఇతర సాంస్కృతిక

రోగులను పరీక్షిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కార్యక్రమాలు అనుకునే వారికి ఈ కార్యక్రమం ఒక మంచి ఆదర్శనీయమన్నారు. చనిపోయిన తమ తోటి విద్యార్థుల జ్ఞాపకార్థం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. సమాజానికి మన వంతు సేవ చేయాలని సంకల్పంతో పాటు గురువులను గౌరవించడం మంచి పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఆలోచనలతో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. నిరుపేదలకు వైద్యాన్ని దగ్గర చేసి సేవలందించడం అభినందనీయమన్నారు. పట్టణానికి చెందిన భోగి వెంకట మాణిక్యం, తుంగాన వెంకటేష్, ఫణీంద్ర, కూన నాగేంద్ర, చింతల సాయిరాజ్, శ్రీకాకుళం మెడికవర్ వైద్యులు పాల్గొని సేవలందించారు. 380 మందికి ఎముకలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, దంత, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాటి తమ గురువులతోపాటు వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

? విద్యుత్ మోటార్ సైకిళ్లు, కృత్రిమ అవయవాల పంపిణీ ఎలా ఉంది?

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆధారంగా వికలాంగ కేటగిరి మేరకు పంపిణీ అవుతుంది. అలిన్కో, సిఎస్‌ఆర్ వంటి పథకాల ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యంతో విద్యుత్ మోటారు సైకిళ్లు అందజేస్తున్నాం. కృత్రిమ అవయవాల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరం గుర్తించి, కొలతలు తీసుకొని విశాఖపట్నంలోని ఎఎల్ఎంయు నుంచి కృత్రిమ అవయవాల సరఫరా అవుతున్నాయి. అనంతరం జిల్లాకు తీసుకొచ్చిన లబ్ధిదారులకు అందజేస్తున్నాం.

? సదరం ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు తీసుకున్న చర్యలు ఏమిటి?

గ్రామ సచివాలయాల్లో స్లాట్‌లు బుకింగ్ కల్పించి సదరానికి పంపిస్తున్నాం. సమీప ప్రాంతంలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నాం. వికలాంగులకు ఇబ్బంది లేకుండా, ఈ ధ్రువీకరణ పత్రాలు అందజేసే చర్యలు చేపడుతున్నాం. కొన్నిసార్లు ప్రత్యేక వైద్య శిబిరాలు సైతం ఏర్పాటు చేసి సదరం ధ్రువీకరణ పత్రాలు

మొదటి పేజీ తరువాయి

అందజేస్తున్నాం.

? వికలాంగుల విద్యకు, స్వయం ఉపాధికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

వికలాంగులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే స్కాలర్‌షిప్ లభిస్తుంది. దూరప్రాంత విద్యార్థులు కళాశాలలో చదువుకునేఅందుకు ప్రత్యేకంగా వసతగృహాలు నిర్వహిస్తున్నాం. స్వయం ఉపాధి, ఉపాధి కల్పనకు ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారిని ప్రోత్సహిస్తున్నాం. వికలాంగులకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నాం.

క్రీడల్లో సిక్కోలు సత్తా

నెల 12 నుంచి 19 వరకు థాయిలాండ్ వేదికగా నిర్వహించిన ఏసియన్ అండర్-16 వాలీబాల్ పోటీల్లో భారత జట్టు తరుపున పాల్గొన్నారు. భారత జట్టు కాంస్య పతకం సాధించింది. జట్టు విజయంలో ఈ యువకుడి కీలక పాత్ర. సర్వీస్ చేయటంలో ప్రత్యేక నైపుణ్యం ఈ యువకుని సొంతం.

కేల్ ఇండియా పోటీల్లో కాంస్య పతకం

నవంబరు 24 నుంచి డిసెంబరు 6 వరకు కేల్ ఇండియా జాతీయ క్రీడలు రాజస్థాన్ రాష్ట్రంలోని డెక్కనూర్లో నిర్వహించారు. ఈ పోటీలో 69 కేజీలు విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. శ్రీకాకుళం పట్టణంలోని శారద డిగ్రీ కళాశాలలో చదువుతుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుంచి అంతర్ విశ్వవిద్యాలయాల కేటగిరీలో క్రీడల్లో పాల్గొంది.

అంతర్ పాఠశాల క్రీడల్లో సత్తా

అంతర పాఠశాలల పోటీల్లో జిల్లా విద్యార్థులు రాణిస్తున్నారు. స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 క్యాటగిరిలో అనేక పథకాలు సాధించారు. 2025 ఏడాదిలో జాతీయస్థాయిలో బాలుర విభాగంలో 103 మంది విద్యార్థులు, బాలికల విభాగంలో 59 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 61 బంగారు పతకాలు 34 రజిత పతకాలు, 38 కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్తున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డి కమిషనర్ తేజభరత్

పుస్తక ప్రదర్శనకు పోటెత్తిన పాఠకులు

అందుబాటులో అనేక రకాల పుస్తకాలు
విశాఖ పుస్తక మహోత్సవంపై పలువురు హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్

శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విద్య, సాహిత్యం, పోటీ పరీక్షలు, పిల్లల పుస్తకాలతో అన్ని రంగాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పుస్తక ప్రదర్శన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు పాఠకులు అభిప్రాయపడ్డారు. పుస్తకాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రదర్శనను సందర్శించిన పాఠకులు పుస్తక ప్రదర్శనపై తమ అనుభవాలను వెల్లడించారు.

ఒకే చోట అన్ని పుస్తకాలు

విద్యార్థులకు అవసరమైన రిఫరెన్స్ పుస్తకాలు ఒకేచోట లభించడం చాలా సంతోషంగా ఉంది. చిన్న వారి నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల వారిని ఆకట్టుకొనే పుస్తకాలు ఉన్నాయి.

పాయల మురళీకృష్ణ,
యువ కవి,
ఉపాధ్యాయులు

పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి

పౌరాణిక, వైజ్ఞానిక, చారిత్రక అంశాలతో కూడిన పుస్తకాలన్నీ ఈ పుస్తక ప్రదర్శనలో ఉంచారు. సాహిత్య పుస్తకాల కలెక్షన్ చాలా బాగుంది. కొత్త రచయితల పుస్తకాలు కూడా ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది.

ఆళ్ల అప్పారావు,
రిటైర్డ్ లెక్చరర్.

మంచి కార్యక్రమం

పుస్తకాలు కరువైపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి ప్రదర్శన చాలా మంచిది. అన్ని రకాల పుస్తకాలు ఒకే చోట కొలువుదీరాయి అంటే ఆనందమే కదా. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు యువతకు మార్గదర్శకంగా ఉంటాయి. అనేక రచయితల గ్రంథాలు స్ఫూర్తిగా నిలుస్తాయి.

పడాల కవిస్వరరావు,
రిటైర్డ్ మెడికల్ హెల్త్ ఉద్యోగి.

ప్రతి పుస్తకం కొనాలనిపించేలా ఉంది

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఏది చూసినా కొనాలనిపించేలా ఉన్నాయి. పిల్లల కోసం నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు ఎక్కువగా ఉండటం నచ్చింది.

లిఖితాయ శ్వేత,
ఎంబిబిఎస్ విద్యార్థిని.

చాలా హ్యాపీగా ఉంది

వృన్తక ప్రదర్శనకు మామూలుగా వచ్చా. ఈ ప్రదర్శనలో ఉన్న పుస్తకాలు చూశాక భిన్నమైన అనుభూతి కలిగింది. ఎంతో విజ్ఞానం, స్ఫూర్తిదాయకమైన అనేక పుస్తకాలను చూసి మనసులో హ్యాపీ ఫీల్ ఏర్పడింది.

పి. ఇందుమతి,
ఎంబిబిఎస్ విద్యార్థి.

పోటీ పరీక్షలకు దోహదపడేలా ఉన్నాయి

ఈ పుస్తక ప్రదర్శనలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే తాజా ఎడిషన్ పుస్తకాలు లభించాయి. ఎవరైనా కొనుక్కునేందుకు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. ఇలాంటివి మాకు చాలా ఉపయోగపడతాయి.

వంశీ,
డిగ్రీ , విద్యార్థి

దేవరకొండ బాలగంగాధర్ పుస్తకం కొన్నాను

పెద్ద రచయితల గ్రంథాలన్నీ ఒకచోటే లభించడం అరుదు. దేవరకొండ బాలగంగాధర్ తిలక్ వంటి కవి పుస్తకాలు దొరకడం కష్టం. అలాంటి పుస్తకాలను, ఆధ్యాత్మిక గ్రంథాలు, జీవిత దిశను చూపించే పుస్తకాలు మనసుకు హత్తుకున్నాయి.

పి. రవీంద్రనాథ్,
కవి, టీచర్.

2 వరకు ప్రదర్శన కొనసాగుతుంది

సిఐటియు మహాసభలు సందర్భంగా పాఠకులకు అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు ఉంచాలనే విశాఖ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశాం. సుమారు 100 మంది ప్రచురణ కర్తలకు సంబంధించి లక్ష పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచాం. దేశ భక్తులు, పోరాటయోధుల పుస్తకాలు, ఉత్తరాంధ్ర, రాష్ట్ర కవులకు సంబంధించిన పుస్తకాలు ఉంచాం. పిల్లల నుంచి పెద్దల దాకా అన్ని రకాల పుస్తకాలు అందుబాటు ధరల్లో అందిస్తున్నాం. జనవరి 2 వరకు కొనసాగే ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయ్ కిరణ్,
పుస్తక ప్రదర్శన నిర్వాహకులు.

చాలా బాగుంది.. మళ్లీ వస్తా

కార్టూన్, ఆటలతో కూడిన పుస్తకాలు చాలా ఉన్నాయి. స్కూల్ పుస్తకాలకు అనుబంధంగా కొన్ని ఉన్నాయి. దాడీని తీసుకొని మళ్లీ వస్తా.

లక్ష్మీ సహస్ర,
విద్యార్థిని, ఏడో తరగతి.

సామాజిక చైతన్యానికి ప్రతీకగా లఘు చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖనగరంలో ఈనెల 31 నుంచి జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రామిక ఉత్సవం కళాకారుల సృజనాత్మకతకు, సామాజిక బాధ్యతకు వేదికగా నిలిచింది. ఆదివారం రెండో రోజు జరిగిన లఘు చిత్రాల ప్రదర్శనలో ఏడు చిత్రాలను ప్రదర్శించగా, ఇవి ప్రేక్షకులను ఆలోచింపజేయడంతో పాటు సమాజంలోని వివిధ కోణాలను ఆవిష్కరించాయి. ఈ ప్రదర్శనలో ప్రధానంగా సామాజిక సమస్యలు, రాజ్యాంగ హక్కులు, శ్రామిక జీవుల వ్యధలను కథా వస్తువులుగా తీసుకున్నారు.

- నిడదవోలుకు చెందిన మెహర్ కట్ల రూపొందించిన 'సాలగ్రామ హనుమంతరావు' చిత్రంతో ప్రారంభమైన ఈ ప్రదర్శన, ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

మాట్లాడుతున్న తేజభరత్

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొత్తపల్లి సీతారాం నిర్మించిన 'వీరి బతుకు' చిత్రం ఉత్తరాంధ్ర జనజీవన చిత్రణను, వారి కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపింది.
- విజయవాడకు చెందిన ఆర్ భార్గవరాయ్ రూపొందించిన 'ఫ్రీడమ్ ఆర్టికల్ 21' ప్రస్తుత కాలంలో వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ పరమైన హక్కుల ప్రాముఖ్యతను ప్రశ్నించింది.
- రైతు సమస్యలపై కె.దుర్గారావు నిర్మించిన 'జై కిసాన్' చిత్రం అన్నదాతల ఆవేదనను ప్రతిబింబించగా, ఉమామహేష్ నిర్మించిన 'ఇంక్' చిత్రం విలక్షణమైన ముగింపుతో ఆకట్టుకుంది.
- విశాఖకు చెందిన మోటూరు శ్రీనివాస్ కుమార్ నిర్మించిన శర్మదేవోభవ లఘు చిత్రం చదువుకున్న మేధావి వర్గం, మధ్యతరగతి కుటుంబాలు సమాజం పట్ల ఉండాల్సిన బాధ్యతను ప్రశ్నించింది.
- విశాఖపట్నంకు చెందిన సనరా వంశీ నిర్మించిన మాతృదేవోభవ లఘు చిత్రం తల్లి ప్రేమ, బాధ్యత అన్న అంశానికి సామాజిక బాధ్యతను జోడించి ప్రస్తుత సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, మాతృమూర్తి పట్ల సమాజంలో ప్రదర్శించాల్సిన గౌరవం వంటి అంశాలను ఇందులో చర్చించినట్లు కనిపిస్తుంది.
- విశాఖపట్నంకు చెందిన దర్శకుడు ఉమామహేష్ నిర్మించిన ఇంక్ లఘు చిత్రం రాతకు ఉన్న శక్తిని, కలం పట్టిన మేధావి సమాజంలో ఎలాంటి విప్లవాన్ని ఎలా తీసుకురాగలడో వివరించింది.

లఘుచిత్రాలు సమాజంలో మార్పు తీసుకొచ్చే ఆయుధాలు : వీఎంఆర్‌డిఏ కమిషనర్ తేజభరత్

ఈ ప్రదర్శనను తిలకించిన విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజభరత్ దర్శకులను ప్రత్యేకంగా అభినందించారు. లఘు చిత్రాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సమాజంలో మార్పు తీసుకొచ్చే ఆయుధాలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా యువ దర్శకులు వాస్తవికతకు దగ్గరగా చిత్రాలను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలు కేవలం విశాఖకే పరిమితం కాకుండా విజయవాడ, నిడదవోలు, ఖమ్మం వంటి ఇతర ప్రాంతాల కళాకారులకు ఇది ఒక గొప్ప వేదికగా నిలిచింది. తక్కువ నిడివిలో ఎక్కువ ప్రభావాన్ని చూపేలా సామాజిక సమస్యలను విశ్లేషించడం దర్శకుల పరిణతిని తెలియజేస్తుంది. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్ అసోసియేషన్ సభ్యులైన ఎల్లాజీ, కుమార్ రాజా తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కళాకారుల మధ్య సమన్వయాన్ని పెంచింది. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ ప్రదర్శనలు, కళ అనేది కేవలం కళ కోసం మాత్రమే కాదు, అది ప్రజల కోసం అనే సందేశాన్ని బలంగా చాటిచెప్పాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
సోమవారం 29
డిసెంబర్ 2025

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

శ్రామిక ఉత్సవ్ అదరహో

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

- ఆకట్టుకున్న కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు
- అబ్బురపరిచిన నృత్య రూపకాలు : ఆలోచింపజేసిన సైన్స్ ప్రదర్శనలు - శ్రమకవనానికి స్పందన

రెండో రోజు ఆదివారం విశాఖ సాగర తీరం ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వీక్షకుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. అత్యధిక సంఖ్యలో ఇక్కడి ఎగ్జిబిషన్ స్టాల్స్ వద్ద ప్రజలు గుమిగూడి తిలకించారు. ప్రజానాట్య మండలి కళాకారుల బృంద గానాలు, కళాకారుల సోలో పాటలు ఆద్యంతం వీక్షకులందరినీ ఉర్రూతలూగించాయి. చిన్న పిల్లలు సైతం 'శ్రామిక ఉత్సవ్' వేదికపై జరిగిన డ్యాన్సులకు హావభావాలతో ఆనందిస్తూ కేరింతలు కొట్టడం, కోలాటం కర్రలతో నృత్యం చేయడం కనిపించింది. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' రెండో రోజూ సందడి నింపింది. సైన్స్, కార్టూన్ ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి. శ్రమకవనం ఆలోచింపజేసింది.

నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ కళాకారులు

శ్రామిక ఉత్సవ్‌కు హాజరైన ప్రజానీకం

విప్లవగీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

విద్యార్థుల నృత్య రూపకం

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

నాటికలోని ఓ సన్నివేశం

మాట్లాడుతున్న కృష్ణయ్య



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న వైద్య విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల కళారూపాలు

కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తేజభరత్, చిత్రంలో సిహెచ్.నర్సింగరావు

ఎస్ఐ ప్రవళ్లికకు ఎస్‌పి ప్రశంస

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎస్ఐ ప్రవళ్లిక

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం.ప్రవళ్లికకు జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి అభినందించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన కేసుల ఛేదన, గంజాయి పట్టివేత, ప్రాపర్టీ నేరాల ఛేదన, ముద్దాయిల అరెస్టు, నిందితులకు శిక్షలు పడే విధంగా చేసిన కృషి, లోక్ అదాలత్ కేసులు పరిష్కారం వంటి అంశాల్లో చాకచక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని ఎస్‌పి మహేశ్వర రెడ్డి తన కార్యాలయంలో ప్రశంసించారు. ఎస్ఐ ప్రవళ్లిక బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డ్‌తోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. తాను చేసిన సేవలకు గుర్తింపు లభించిందని, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మహేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు లేకుండా చేపడుతున్న రోడ్డు పనులు

అధికారులు లేకుండా రోడ్డు పనులు

ప్రజాశక్తి- బూర్జ

అధికారుల పర్యవేక్షణ లేకుండానే రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని ఉప్పినవలస గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.20 లక్షలతో రైతు సేవా కేంద్రం, గూడాంకు వెళ్లేందుకు రహదారి నిర్మాణానికి నిధులను మంజూరు చేశారు. అయితే ఆదివారం కాంట్రాక్టర్ రోడ్డు పనులను హుటాహుటిగా పూర్తి చేశారు. అయితే నాణ్యత పరిశీలించాల్సిన పంచాయతీరాజ్ జెఇ మణికుమార్ కనీసం పర్యవేక్షించకపోవడం, ముఖ్యంగా పంచాయతీ రాజ్ అధికారులు లేకుండా రహదారి పనులు పూర్తి చేయడంపై గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం రహదారి నిర్మాణం కోసం కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఆ పనులు తూతూ మంత్రంగానే జరుగుతున్నాయని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ డిఇఇ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పనులు జరిగేటప్పుడు అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఈ పనులను పరిశీలిస్తానని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

శరవేగంగా సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు సిసి రహదారులు, కాలువల నిర్మాణ పనులు కూటమి నాయకులు శరవేగంగా చేపడుతున్నారు. గ్రామంలోని కొంచాడ శ్రీరాములు ఇంటి నుంచి బలగవారి కళ్లం వరకు ఉపాధి నిధులు రూ.8.50 లక్షలతో సిసి రహదారి, కాలువల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ పనులను పరిశీలించిన వారిలో టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కొడాపు శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని వివాహిత మృతి

ప్రజాశక్తి- పొందూరు

నీలవేణి (ఫైల్)

మండలంలోని కొంచాడ గ్రామానికి చెందిన సిడగ నీలవేణి (30) ఒంటికి నిప్పంటుకుని తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. గ్రామస్తుల వివరాల మేరకు ఇంట్లో శనివారం ఉదయం వేడినీరు మరగబెట్టేందుకు కర్రల పొయ్యి వెలిగించేందుకు ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను వేసి నిప్పు పెట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి చీరకు అంటుకోగా మొఖం తదితర శరీర భాగాలు తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఈమెకు భర్త ఆదినారాయణ, ఏడేళ్ల కుమారుడు యశ్వంత్, మూడేళ్ల కుమార్తె కీర్తి ఉన్నారు. పొందూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

విశాఖ పుస్తక మహోత్సవంలో 'కుప్పిలి' కవితా గానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కవితా గానం చేస్తున్న కవి వెంకట రాజారావు

సిబిటియు ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న విశాఖ పుస్తక మహోత్సవంలో భాగంగా జరిగిన శ్రామిక మహోత్సవంలో పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావు తన 'కామ్రేడ్' అనే కవితను గానం చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు. కార్మికుల జీవన పోరాటాలు, శ్రమ విలువలను ప్రతిబింబించేలా సాగిన ఈ కవితాగానం సభలో శ్రామిక చైతన్యం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు తెలకపల్లి రవి, వెలమల సిమ్మన్న, గంటేడ గౌరు నాయుడు, వీకటి దివాకర్ తదితరులు పాల్గొని తమ కవిత్వంతో శ్రామిక ఉద్యమానికి సాహిత్య బలం చేకూర్చారు. శ్రామికుల హక్కులు, సామాజిక న్యాయంపై కవిత్వం ద్వారా అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా కళింగ ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలం కేశవరెడ్డి స్కూల్ ఎదురుగా చౌదరి సత్యన్నారాయణ తోటల్లో ఆదివారం రాష్ట్రస్థాయి కళింగ సామాజిక వర్గ ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. జిల్లాతో పాటు విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, గుడివాడ, బరంపురం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడిన జిల్లాతో పాటు, ఇతర జిల్లా, రాష్ట్రాల్లో ఉన్న సామాజిక తరగతికి చెందిన వారంతా ఈ కార్యక్రమానికి హాజరై సందడిగా గడిపారు. కళింగ సంక్షేమ సంఘం నాయకులు దుప్పల వెంకటరావు, దానేటి శ్రీధర్, పూజ చెల్లయ్య, చింతాడ రామ్మోహన్ తదితరులు భారీఎత్తున కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లును చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ గాయకుడు ధనుంజయ్ హాజరై పాటలు పాడారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎపి పరిపాలన ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, విజయకృష్ణా విశ్వవిద్యాలయం విసి ఆచార్య కూన రామ్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, డిసిఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, టిడిపి జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, పూర్వ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, మాజీ కేంద్రసహాయ మంత్రి కిల్లి కృపారాణి, పేడాడ తిలక్, పేడాడ రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస

2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని జిల్లా వికలాంగుల అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మోహనరావు అన్నారు. కాశీబుగ్గ ప్రైవేటు కళ్యాణ మంటపంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెళ్లికాని వికలాంగులకు రైస్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. పంచాయతీ నుంచి కార్పొరేషన్ వరకు అన్ని రంగాల్లో ప్రతి వికలాంగులకూ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరారు. బడ్జెట్‌లో ఐదుశాతం కేటాయించి వికలాంగులకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సంపదరావు లక్ష్మి, సంతబొమ్మాళి మండల అధ్యక్షుడు బడగం ఎర్రన్నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రమణయ్య, టెక్కలి మండల అధ్యక్షుడు కొవ్వల చంద్రశేఖరరావు, పలాస-కాశీబుగ్గ మండల అధ్యక్షుడు, రూరల్ అధ్యక్షుడు పీతాంబరం, జగన్నాథరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేణుగోపాల్

ముగ్గుల రంగులు.. ముచ్చట్లు

పూండి మార్కెట్‌లో రంగులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చిన్న పల్లెటూరులు మొదలుకొని పట్టణాల వరకు ముగ్గుల ముచ్చట్లు మొదలయ్యాయి. డిసెంబరు 31, సంక్రాంతి ఉత్సవాలు సమీపిస్తున్న వేళ మార్కెట్లో ముగ్గులేసుకునే రంగులకు భలే గిరాకీ ప్రారంభమైంది. దీంతో బజార్లు కళకళలాడుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా రంగులు ఉంచి విక్రయాలు చేపడుతున్నారు. ఇప్పటి నుంచే ముగ్గులు వేసేందుకు మహిళలు రంగులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు, హరిపురం, పూండి, వజ్రపుకొత్తూరు ప్రాంతాల్లో ముగ్గుల రంగులకు మంచి డిమాండ్ పలుకుతోంది. సువర్ణ శోభితమైన రంగులపై మహిళలు ఆసక్తి చూపూతూ ఇష్టమైన వాటిని కొనుగోలు చేస్తున్నారు. రూ.10 ప్యాకెట్ల నుంచి రూ.వంద వరకు రంగుల ధరలు ఉండడంతో మహిళలు ముగ్గులు వేసేందుకు వాటిని తీసుకెళ్తున్నారు.

కథలు చెబుతున్న విద్యార్థి

విద్యార్థులు క్రమశిక్షణ నేర్చుకోవాలి

లావేరు: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణ నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథలు చదివి వినిపించారు. ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణ నేర్చుకున్నట్లయితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. మనిషి జీవితంలో క్రమశిక్షణ ఒక భాగమన్నారు. వేకువ జామున లేచి ప్రతి విద్యార్థి యోగా చేయాలన్నారు. యోగాలో పది ఆసనాలను విద్యార్థులతో వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపొందిన విజేతలతో ఎఙా

చెస్ సాధనతో మెదడుకు మేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నిరంతరం చెస్ క్రీడ సాధనతో మెదడు పదునెక్కుతుందని, తద్వారా చదువులో కూడా రాణించడానికి ఉపయోగపడుతుందని సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు ప్రెసిడెంట్ డా.గంజి ఆర్ ఎజ్రా తెలిపారు. నగరంలోని తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీలో క్రిస్మస్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని 209వ చెస్ టోర్నీను నిర్వహించారు. ఐదు రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీలో చెస్ క్రీడాకారులు ఆసక్తిగా పాల్గొన్నారు. బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొన్న ఎజ్రా మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధావుల క్రీడని, అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు పాల్గొని చెస్‌ను నేర్చుకోవడం, పోటీల్లో రాణిస్తుండటం అభినంద నీయమన్నారు. అనంతరం విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు, బహుమ తులను అందజేశారు. కార్యక్రమంలో ఫిడే రేటింగ్ చెస్ ప్లేయర్, స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ కోచ్ భేరి చిన్నారావు, చెస్ కోచ్ కె.సాయినిరంజన్ సింగ్, చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- అరసవల్లి

ఆరోగ్య ప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని రాజస్థాన్ హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ సంభాజీ శివాజీ షిండే ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, కార్యనిర్వాహణాధికారి కె.ఎన్.వి.డి.వి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వది ంచారు. ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.

రేపు టిడిపి కుటుంబసభ్యుల సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని శారద కళ్యాణ మండపంలో ఈనెల 30వ తేదీ మంగళవారం టిడిపి కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి టిడిపి ముఖ్య నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు, గ్రామకమిటీ అధ్యక్షులు అనుబంధ సంఘాల సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది.

ఆదిత్యుని ఆదాయం రూ.4.4లక్షలు

ప్రజాశక్తి- అరసవల్లి

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో యాత్రికులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఇఒ ప్రసాద్ ఆధ్వర్యంలో టెంట్లు వేసి, క్యూ లైన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాత్రికులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి రూ.4 లక్షల 6,415 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా లక్షా 63,600, పూజలు, విరాళాల రూపంలో రూ.29,955, ప్రసాద విక్రయం ద్వారా రూ.లక్షా 11,795, ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా రూ.లక్షా 1065 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

త్వరలో డే అండ్ నైట్, రామలక్ష్మణ రోడ్డు విస్తరణ

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి సర్కారుతోనే అభివృద్ధి ముడిపడి ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కార్పోరేషన్ పరిధిలో రూ.18.50 లక్షల నిధులతో ఎల్.బి.ఎస్ కాలనీలో సిసిరోడ్డును ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్పోరేషన్ స్థాయి అభివృద్ధిని ఇప్పుడు శ్రీకాకుళం సాధిస్తోందని, ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే రహదారులను డ్రైన్లతో సహా అభివృద్ధి చేస్తూ విజన్‌ను అమలు పరుస్తున్నామని స్పష్టం చేశారు. డే అండ్ నైట్ నుంచి రామలక్ష్మణ వరకూ ఉన్న అత్యంత రద్దీగా ఉండే రహదారిని అభివృద్ధి చేయడం తన ఎన్నోఏళ్ల కలని అన్నారు. రోడ్డును ఆనుకుని వ్యాపారం చేసేవారు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావడంతో భవిష్యత్‌లో ఈ రోడ్డు కూడా విస్తరిస్తున్నామని తెలిపారు. సుడా నుంచి నిధులు మంజూరు చేయించి ఎనబై అడుగుల రహదారిని అతిత్వరలో నిర్మిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ట్రాఫిక్‌తో నిత్యం నగర వాసులు ఇబ్బంది పడుతూనే ఉన్నారని, దీనికి త్వరితగతిన పరిష్కార మార్గం చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మార్కింగ్ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేసినా ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వామ్యమై వాలంటీర్‌గా కార్యక్రమాలు చేయాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.

అరుణ్ కుమార్‌కు సన్మానం

కొత్తూరు: టిడిపి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన ఆగతముడి అరుణకుమార్‌ను టిడిపి కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, మాజీ వైస్ ఎంపిపి, గురండి ఎంపిటిసి అగతముడి భైరాగినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీలు ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎద్దు దాస్‌నాయుడు, ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, టి.తిరుపతి రావు, నూకరాజు, గోగుల వరప్రసాదరావు నాయుడు, పి.లక్ష్మణరావు, డి.శ్రీను, ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

రూ.పది వేలు ఆర్థికసాయం

కొత్తూరు : స్థానిక రెల్లివీధికి చెందిన నాగవంశపు రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం మెడికవర్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నిలమణిదుర్గ లారీ, వ్యాన్, ఓనర్స్ యూనియన్ అసోసియేషన్ ఆదివారం యువకుడి తల్లితండ్రులు మల్లేష్, అదిలక్ష్మిలకు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ చోడవరం వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ ఇసై నాగరాజు, సెక్రెటరీ పిన్నింటి ధర్మారావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పసి ప్రాణం... అంతుచిక్కని రోగం

ముద్దు ముద్దు మాటలతో, చిలిపి నవ్వులతో, కేరింతలతో ఆ తల్లి కొంగు పట్టుకుని తిరిగే కుమారుడిపై విధి కన్నుకొట్టింది. అంతుచిక్కని వ్యాధితో మంచానికే పరిమితం చేసింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు ఉలుకుపలుకు లేకుండా మంచాన పడి వుండడంతో ఆ తల్లి మనసు తల్లడిల్లి పోయింది. కొడుకు ఒక్కసారైనా అమ్మ అని పిలవకపోతాడా అని గంపెడు ఆశతో ఎదురు చూస్తుంది.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండలం పాలవలస పంచాయతీ పరిధిలోని మర్రిపాడు గ్రామానికి చెందిన జంపా త్రినాధరావు, గాయత్రి దంపతుల కుమారుడు చైతన్య అరుదైన వ్యాధితో బాధ పడుతున్నాడు. నవమాసాలు మోసి కని పెంచిన కొడుకు వేలాది మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో ఉలుకుపలుకు లేకుండా మంచాన పడి వుండడంతో పుట్టెడు దు్ఖాన్ని కడుపులో దాచుకుని తమ కొడుకును కంటికి రెప్పలా కాపాడు కుంటున్నారు. ఆదేవుని శాపమో, విధికి కన్ను కొట్టిందో ఏమోగాని మాయదారి రోగంతో పసి ప్రాణం విలవిలాడుతుంది. ఐదేళ్ల వయసులో వచ్చిన జ్వరం తగ్గక పోవడంతో శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా బ్రెయిన్ వైరస్ (ఎస్ఎస్‌పిఇ) అరుదైన వ్యాధి వచ్చిందని వైద్యులు చెప్పడంతో తల్లి దండ్రులు ఒక్కసారిగా బోరున విలపించారు. తమ కుమారుని ఆరోగ్య వంతుడిగా చేసుకు నేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు.

అప్పులతో వైద్యం

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడికి వైద్యం చేయించేందుకు ఆ తల్లిదండ్రుల ఆరాటం ఇంత అంతా కాదు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి వైద్యం చేయిస్తున్నారు. అప్పటినుంచి చైతన్య నడవలేడు, కూర్చోలేడు, తినలేడు, మాట్లాడలేడని, నొప్పిగా ఉంటే గుండెలు కొట్టుకుంటాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుని పరిస్థితిని చూసి తట్టుకోలేక పోతున్నారు. ఇప్పటికే విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాల్లో చైతన్యకు వైద్యం చేయించారు. ఇదిలా ఉంటే ఈ వ్యాధి పూర్తిగా నయం అయ్యేందుకు చాలా సమయం పడుతుందని, ఖరీదైన వైద్యం అందించాల్సి ఉంటుందని వైద్యులు చెప్పటంతో కొంతమంది వైద్యుల సలహాలతో మహారాష్ట్రలోని పూణేలో సెంట్ ఫర్ లైఫ్ సైన్సెస్ హోమియోథెరఫీ డాక్టర్ పవ్వల్ గువ్వంత్ అర్జునులు వద్ద చికిత్స పొందు తున్నాడు. అయితే అక్కడికి ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్యం కోసం వెళ్లి వచ్చేందుకు రూ.50 వేలు వరకు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

చైతన్య

అందని ప్రభుత్వ సాయం

గత మూడు సంవత్సరాలుగా తమ కుమారుడు మంచానికి పరిమితం అయ్యాడు. అటు వైసిపి ప్రభుత్వంలో, ఇటు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కూడా నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ కుమారుడికి పెన్షన్ మంజూరు చేయాలని, సిఎం సహాయనిధి నుంచి వైద్యానికి నిధులు సమకూర్చాలని ఎన్నోమార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయితే ఒకరు కూడా కరుణించలేదని వాపోయారు. ఇది తమ దురదృష్టమని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదే విషయంపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పార్టీ కార్యాలయానికి రెండురోజుల క్రితం బాబుని తీసుకుని వెళ్లామని, అయితే పింఛను మంజూరుకు హామీ ఇచ్చారని తల్లిదండ్రులు తెలిపారు.

వింతవ్యాధితో తల్లిని కూడా గుర్తుపట్టలేని బాలుడు

దాతలసాయం కోసం ఎదురుచూపు

కూలి చేసుకొని పొట్ట నింపుకునే తమ బతుకులకు విధి వెక్కిరించిందని తల్లిదండ్రులు వాపోయారు. కూలి చేస్తేనే కడుపునిండేదని అయితే తమ కుమారుడిని వైద్యం అందించేందుకు అన్ని రకాలుగా అప్పులు చేశామని, మనసున్న మారాజులు దాతలు కరుణించి వైద్యం కోసం సాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దాతలు ముందుకు వచ్చి జంప గాయత్రి, 9502254379 నంబర్‌కు ఫోన్ పే గాని, యూనియన్ బ్యాంకు సంబంధించిన అకౌంట్ నెంబర్ 043910100217023, ఐఎఫ్‌సి కోడ్ UBIN 0804398 దాతలు స్పందించి వైద్యానికి సహక రించాలని గ్రామస్తులు, పలువురు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, తల్లి దండ్రులు కోరుతున్నారు.

మేధస్సుకు పదును పెట్టేవే సిక్కోలు లఘు చిత్రోత్సవాలు

లోగో ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం పట్టణం, రూరల్ మండలం అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో ఆదివారం సిక్కోలు లఘు చిత్రోత్సవం 2025 లోగో ఆవిష్కరణ కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ యువత మేధస్సుని వెలికి తీసే ప్రయత్నంలో భాగమని, దీనిద్వారా టాలెంట్ వ్యక్తం అవుతుందన్నారు. కార్యక్రమం జిల్లాలో ఎంసిఎ, పికె టీం ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్ శ్రీకాకుళంలో నిర్వహించడం పలువురు నటులు, డైరెక్టర్లు, రచయితలకు ప్రోత్సహించే దిశలో మీరు చేస్తున్న ప్రయత్నాలు అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ఎంసిఎ వ్యవస్థాపక అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుమలరావు, పికె టీం ప్రసాద్, కీర్తి, రామకృష్ణ, రాము, మాదారపు వెంకటేశ్వరరావు, ఎస్.వి రమణ మాదిగ, తెలుగు యువత విశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ కణితి సూర్యనారాయణ, ఏలియన్స్ క్లబ్ మెంబర్స్ జామి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్యే శంకర్

బాపూజీ కలలను సాకారం చేద్దాం

శ్రీకాకుళం సిటీ: స్వచ్ఛభారత్ కోసం, బాపూజీ కన్న కలలను, మనమందరం కలిసి సాకారం చేద్దామని ఎమ్మెల్యే గొండు.శంకర్ అన్నారు. ఎనభై అడుగుల కూడలి వద్దగల ఆనందమయ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన రన్‌ఫర్ స్వచ్ఛభారత్ ఆదివారం ప్రారంభించి మాట్లాడు తూ భారతదేశంలో ఉండే అన్ని కిష్ణ డైమండ్స్ కార్యాలయాల్లో సుమారు వందకుపైగా, ఒకే సమయంలో 5కె మారథాన్‌ను నిర్వహించటం దేశానికే ఆరోగ్య స్ఫూర్తిదాయకమన్నారు. నిర్వాహకులు పొట్నూరు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని, మనం స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉండగలమని, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. 526 మంది రన్‌ఫర్‌లో పాల్గొన్నారని, స్వచ్ఛభారత్‌లో భాగంగా కృష్ణ డైమండ్స్ అందించిన నగదును శ్రీకాకుళం స్వచ్ఛతకై మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌కు అందించారు.

శక్తి యాప్‌పై అవగాహన

టెక్కలి రూరల్ : మండలంలోని తేలినీలాపురంలో శక్తియాప్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శక్తి టీం ఇన్‌ఛార్జి గిరిధర్ ఆధ్వర్యాన సైబర్ క్రైమ్స్, యాంటీడ్రగ్స్, రోడ్, సేఫ్టీపై వివరించారు. శక్తి యాప్ గ్రామస్తులతో డౌన్‌లోడ్ చేయించి ఉపయోగాలను తెలియజేశారు. అన్ని పోలీస్ సేవలకు శక్తియాప్ ఉపయోగపడుతుందని టీమ్ సభ్యులు తెలియజేశారు. సర్పంచ్ పోలాకి లక్ష్మి, ఉమెన్, పిసి యశోద, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమా పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని మకరాంపురం వద్ద ఆదివారం విశ్వశాంతి క్రికెట్ అసోసియేషన్, ఫిజిక్స్ వాలా, శ్రీవృక్ష విద్యా సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్రాష్ట్ర టి-20 క్రికెట్ పోటీలను ఆదివారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇటువంటి పోటీలు, క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తాయన్నారు. స్థానికంగా ఎన్నో అంతర్రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తూ, క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్న విశ్వశాంతి క్రికెట్ అసోసియేషన్ సేవలు ఆదర్శనీయమన్నారు. బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తమరాల శోభన్, శ్రీవృక్ష అధినేతలు బి.వి.రమణ, తిలక్, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగేష్, టి.వి.రమణ, జె.వి.భాస్కరరావు, బి.మృత్యుంజయరావు, కామేష్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న విప్ అశోక్

పోటీల్లో భాగంగా మొదటి రోజు ఒడిశాకు చెందిన కల్లికోట టీమ్, పాలకొండ టీమ్‌ల మధ్య మొదటి మ్యాచ్ నిర్వహించారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కలికోట టీమ్ 20 ఓవర్లలో 8 వికెట్ల కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం పాలకొండ టీమ్ 14.2 ఓవర్లలో కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు సాధించి విజయం సాధించింది.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ప్రమాదాల నివారణకు సిసి కెమెరాలు, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కాశీబుగ్గ డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్ మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ ప్రాంతంలో మున్సిపల్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, కాశీబుగ్గ జెడ్‌పి హైస్కూల్, కాశీబుగ్గ బస్టాండ్, బస్సులు ఆగే స్థలం వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మాణం చేపట్టాలన్నారు. రోడ్లపై బైక్ రేసింగ్ చేపట్టిన, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలతో ప్రయాణం చేసిన అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కాశీబుగ్గ సిఐ వై.రామకృష్ణ, కమిషనర్ ఇ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి షేక్ షహబాజ్ అహ్మద్